ప్రజాశక్తి

గురువారం 1 జూన్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విద్యాశాఖపై విధుల గుదిబండ !



- టీచర్లు, సిబ్బందిపై నానాటికీ పెరుగుతున్న పనిభారం
- అడుగడుగునా రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలు, వెబెక్స్‌లే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో పనిచేసే ఎంఆర్‌సి సెంటర్లపైనా, సిబ్బంది, స్కూల్ టీచర్లపైనా అనేక రకాల పనుల భారాన్ని మోపడం విశాఖ జిల్లాలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల అకస్మిక తనిఖీలు, పర్యవేక్షణలతో జిల్లాలో విద్యా వ్యవస్థ అట్టుడుకుతోందనే చెప్పొచ్చు. సస్పెన్షన్‌లు, మెమోలు సర్వసాధారణమైపోయాయి. ఒకప్పుడు విద్యాశాఖ అంటే ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే క్రమంలో బడి బయట ఉన్నవారిని బడుల్లో చేర్పించడం, పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడంగా ఉండేది. స్కూళ్లకు బట్టలు, పుస్తకాల పంపిణీ వంటివి ఏడాదికో దఫా అందేవి. 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్ తన ప్రభుత్వంలో విద్యారంగంలో పలు మార్పులు చేశారు. కేంద్రంలోని బిజెపి సర్కారు విద్యను కాషాయీకరణ చేసే క్రమంలో మాతృభాషకు మంగళం పలకడం ద్వారా అంతా హిందీ, ఇంగ్లీషు అనే పద్ధతిని ముందుకు తీసుకెళ్లాలనే పథకం కూడా అందులో దాగి వుంది. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేసే ప్రక్రియకు జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడమే కాకుండా దూకుడుగా ముందుకెళ్తోంది. తాజాగా విశాఖ జిల్లానే తీసుకుంటే.. విద్యాశాఖ లక్ష్యాలతో ఆయా అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. పలువురు ప్రధానోపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నట్లు తెలుస్తోంది. అనేక విధులతో విద్యా సంవత్సరం గుదిబండలా మారిపోయిందని, బోధనేతర పనులు అధికమయ్యాయని టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. మండలాల్లో ఎంఆర్‌సి సెంటర్లలో పనిచేసే సిఆర్‌పి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, డేటా ఎంట్రీల పరిస్థితి ఇందుకేమీ తీసిపోవడం లేదు. వీరిపైనా నిరంత పనుల భారాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు మోపుతున్నారన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి.

పలు పథకాలతో తలమునకలు

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ జిల్లాలోని అన్ని స్కూళ్లకు ఎంఆర్‌సి సెంటర్లు, హై స్కూళ్ల ద్వారా శరవేగంగా సాగుతోంది. విద్యార్థులకు యూనిఫారాలు, షూలు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, డిక్షనరీలు వంటివాటితో ఈ కిట్లు పంపిణీ కార్యక్రమం సాగే క్రమంలో అవి స్కూళ్లకు చేరే విధానంపై ఈ శాఖలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కొన్నిచోట్ల కిట్లు పంపిణీ సక్రమంగా జరగకపోవడంతో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాలో పర్యటనలు చేస్తూ వణుకు పుట్టిస్తున్నారు. 'నాడు-నేడు' పనుల ప్రగతిపై నిరంతర నివేదికలు, వెబ్‌సైట్‌లో పనుల అప్‌లోడింగ్ విధానం బాధ్యతను ప్రధానోపాధ్యాయుల నెత్తిన ప్రభుత్వం పెట్టిన విషయం మిగతా 2లో..

చంద్రబాబు సందడి



టిడిపి విశాఖ, అనకాపల్లి జిల్లాల ముఖ్య నేతల ఇంట జరిగిన శుభకార్యాలకు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఈ రెండు జిల్లాల్లో ఘన స్వాగతం లభించింది. పలువురు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కాలేజీలు, హాస్టళ్లు, హోటళ్లలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి విద్యార్థులు మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా కట్టడి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌లోని తన ఛాంబర్‌లో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాఫిక్ సబ్స్టాన్సస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అందుకుగల కారణాలను విశ్లేషించి కట్టడి చేయాలని పోలీస్, ఎస్ఇబి అధికారులను ఆదేశించారు. అన్ని కాలేజీల యాజమాన్యాలు తరచుగా తమ కాలేజీ ఆవరణలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన మిగతా 2లో..

ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలి

▶ వార్త 2లో..

మోడీ పాలనలో బాగుపడ్డ కార్పొరేట్లు

▶ వార్త 2లో..

నగరంలో పేదల ఇళ్లు కూల్చివేత

▶ వార్త 4లో..




నావికా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హరికుమార్

నావికా దళ బలోపేతానికి కృషి

భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ హరికుమార్ వార్త మెయిన్‌లో..

ప్రజల మనిషి సత్తిబాబు

సంస్మరణ సభలో వక్తలు



ప్రజాశక్తి ప్రచురించిన సత్తిబాబు సంస్మరణ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

విలువలతో కూడిన వ్యక్తిత్వం కలిగిన ప్రజల మనిషి డి.సత్తిబాబు అని పలువురు వక్తలు కొనియాడారు. చిరునవ్వుతో పలకరిస్తూ.. ఇతర పార్టీ నాయకులతో కూడా సన్నిహితంగావుంటూ, ఆయన ప్రజా ఉద్యమాలను నిర్మించారని గుర్తు చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు డి.సత్తిబాబు సంస్మరణ సభ బుధవారం నర్సీపట్నంలోని తురకబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎ.రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సత్తిబాబు తుదిశ్వాస విడిచే వరకు శక్తివంతమైన పోరాటాలు చేపట్టారని అన్నారు. కష్టాలను దిగమింగి ప్రజా సేవలో వుంటూ, కుటుంబంతోనూ, స్నేహితులతోనూ అత్యంత ఆత్మీయంగా వుండేవారన్నారు. కమ్యూనిస్టు పద్ధతులను చివరివరకు పాటించారన్నారు. బిజెపి నాయకత్వంలో మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్న నేపథ్యంలో ప్రజా పోరాటాలు మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో పోరాటాలను విస్తృతం చేయాల్సిన సమయంలో సత్తిబాబు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విద్యాశాఖపై విధుల గుదిబండ !

తెలిసిందే. దీంతో వారూ సతమతమవుతున్నారు. మండలాల్లో ఎంఆర్‌సి సెంటర్ల ద్వారా పని జరిగేలా నియంత్రణ చేయడం నిత్యకృత్యంగా సాగుతోంది. తాజాగా టీచర్ల బదిలీలు కూడా మండలాల్లోని ఎంఆర్‌సి సెంటర్లకు గుదిబండగా మారాయనే చెప్పొచ్చు. ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన ఖాళీలు, టీచర్లు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లి పనిచేయాలని కోరుకున్నా వాటి జాబితాలను మండలాలే సిద్ధం చేసేలా సిబ్బందిపై ఒత్తిడి కొనసాగుతోంది. పై అన్నింటిపైనా పర్యవేక్షణలో భాగంగా టెలీ కాన్ఫరెన్సులు, వెబెక్స్‌లతో తలకు మించిన భారం వీరిపై పడుతోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిఇ 12సి ఫ్రీ ఎడ్యుకేషన్ పేరిట ఓ విధానాన్ని తీసుకొచ్చింది. దీనికోసం రూపొందించబడ్డ రాష్ట్ర స్థాయి నిబంధనలు జిల్లా విద్యాశాఖ అధికారుల్లో గందరగోళానికి తెరతీశాయి. తొలుత 25 శాతమే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యాలయాల్లో అవకాశం అంటూ వెల్లడించారు. తర్వాత అమ్మఒడి డబ్బులు కార్పొరేట్ స్కూళ్లకు ఇచ్చేయాలనే విధానం తీసుకున్నారు. తాజాగా మొత్తం ఫ్రీ ఎడ్యుకేషన్ అంటున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మండలాల్లోగల ఎంఆర్‌సి సెంటర్లలోని సిబ్బందిపైనే ఈ నూతన విధానం పని భారమూ పడనుంది.

ప్రజల మనిషి సత్తిబాబు

మృతిచెందడం తీరని లోటని అన్నారు. పోరాటాలతో ప్రజల పక్షాన నిలవడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కులవివక్షతకు వ్యతిరేకంగా సత్తిబాబు పోరాడారని అన్నారు. నర్సీపట్నం ప్రాంతంలో భూ పోరాటాలు చేపట్టారని గుర్తుచేశారు. గొలుగొండ జెడ్‌పిటిసి గిరిబాబు మాట్లాడుతూ ప్రజా పోరాటాలతో పాటు పేదలకు ఉచిత వైద్యశిబిరాలు వంటివి నిర్వహించారని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసిన సత్తిబాబు మరణించడం తీరని లోటన్నారు. సత్తిబాబు కుమారుడు అమర్ మాట్లాడుతూ సత్తిబాబు మరణించలేదని, ఆయన పేరు కడవరకూ జనం హృదయాల్లో నిలిచే ఉంటుందని అన్నారు.

ప్రత్యేక సంచిక, పుస్తకం ఆవిష్కరణ

సత్తిబాబు సంస్మరణ సభ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను, అల్లూరి సీతారామరాజు పూర్వ విద్యార్థుల సంఘం సౌజన్యంతో సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ప్రచురించిన 'జనం మనిషి కామ్రేడ్ డి.సత్తిబాబు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, వైసిపి నాయకులు సిహెచ్ సన్యాసిపాత్రుడు, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్మిక నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, జెవివి రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, సత్తిబాబు భార్య శారద, కుమారులు అమర్‌బాబు, డాక్టర్ అజయ్‌బాబు, వదిన, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ, రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, బిల్డింగ్ వర్కర్సు యూనియన్ నాయకుడు రామకృష్ణ, ఎండిఎం జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఎఎస్ఆర్ జిల్లా పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు అర్జునరావు, రమణయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు సత్తిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. సత్తిబాబు పోరాట ఘట్టాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి చర్యలు

కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు కౌన్సిలింగ్ చేయాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేసే వారిని జోన్ల వారీగా విభజించి, వారందరినీ కౌన్సిలింగ్ సెంటర్లకు పిలిచి మాట్లాడాలన్నారు. అప్పటికీ మారకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ ప్రభావం వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయని, వాటి బారిన పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. తల్లిదండ్రులు యుక్త వయసులో ఉన్న తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల అలవాటు మానుకోలేని వారిని డి అడిక్షన్ సెంటర్లకు పంపి కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తక్షణమే గుర్తించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, పోర్ట్, కోస్ట్ గార్డ్, మెడికల్, విద్యా శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. డిసిపి విద్యాసాగర్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి శంకర్ ఫౌండేషన్‌లో మరిన్ని సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సామాజిక సేవలో భాగంగా జూన్ 1 నుంచి 30 వరకు సీనియర్ సిటిజన్లు, తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత కన్సల్టేషన్ వైద్య సేవలు అందిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఇంచార్జ్ ఉష ఆత్మకూరి తెలియజేశారు. బుధవారం ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్ సేవలు అందించడంతోపాటు దీనికి అదనంగా ఆసుపత్రిలో ఫార్మసీపై 10 శాతం తగ్గింపు, ఆప్టికల్స్‌పై 15 శాతం తగ్గింపు ఉంటాయన్నారు. కంటి శుక్లం శస్త్రచికిత్సల ప్యాకేజీలపై 10 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. కంటి వ్యాధులను గుర్తించడానికి క్రమం తప్పకుండా అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఆసుపత్రి సీనియర్ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి రత్, ఆసుపత్రి పిఆర్, లైసెన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉపాధి కూలీలంతా ఐక్యంగా పోరాడి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. బుధవారం ఉదయం కశింకోట మండలం, తేగాడలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లకుపైగా ఉపాధి చట్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు తగ్గించడంతో కూలీలకు పనిదినాలు తగ్గుతాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రధాని మోడీ ప్రభుత్వ కుట్రలను పోరాటాలతో తిప్పికొట్టి రక్షించుకోవాలన్నారు. కేరళలోని సిపిఎం నాయకత్వాన వామపక్ష ప్రభుత్వం రోజు కూలీ రూ.730 చెల్లిస్తోందన్నారు. ఉపాధి పనులు ఏడాదికి 200 రోజులు కల్పించాలన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రోజుకు రూ.600కు తగ్గకుండా కూలీలకు వేతనం చెల్లించాలన్నారు. కూలీలకు గతంలో వలె పనిముట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి, సిఐటియు కశింకోట మండల నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

మోడీ పాలనలో బాగుపడ్డ కార్పొరేట్లు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తొమ్మిదేళ్ల మోడీ పాలనలో ఓ పక్క భారతదేశం బాగా వెనుకబడిందని, అన్ని తరగతుల ప్రజలూ తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని, మరోపక్క అదానీ, అంబానీల కార్పొరేట్ సంస్థలు మాత్రం బాగుపడ్డాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయత్నిస్తూ వస్తోందన్నారు.

అవినీతిని అంతం చేస్తామని చెప్పిన మోడీ వందల వేల కోట్లు దేశ సంపదను అక్రమంగా దోచుకొని విదేశాలకు పారిపోయిన 28 మంది బడా కార్పొరేట్ సంస్థల వ్యక్తులను ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. వీరిలో ఒకరు మినహా మిగిలిన 27 మంది మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌కు చెందిన వారిని అన్నారు. మోడీ పాలనలో బిజెపి కార్యకర్తలకు కూడా ఎటువంటి మేలూ జరగలేదన్నారు. నూతన పార్లమెంటు భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం శోచనీయమన్నారు. మోడీ అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ దేశవ్యాప్తంగా అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 12న బీహార్ రాజధాని పాట్నాలో బిజెపి మినహా అన్ని పార్టీలతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన తిరోగమనంగా ఉందన్నారు. ఆదాయం బాగా తగ్గిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు క్షేత్రపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యం కీలకం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జీవితంలో ఎంత ఎదిగామనేది ముఖ్యం కాదని, ఎంత ఆరోగ్యంగా ఉన్నామన్నదే కీలకమని ఎయు మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కయ్యపాలెంలోని కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ధూమపానం నివారణపై అవగాహన కల్పించారు. రాజుల కాలం నుంచి ఇప్పటివరకు వినియోగించే వివిధ రకాల సిగిరెట్ యాస్టిరీస్‌ల ప్రదర్శన చేపట్టారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఒక్కరోజు కాదని, నిరంతర ప్రక్రియగా పాటించాలని, తద్వారా తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యులు, ఎదుట వారి ప్రాణరక్షణకు కూడా దోహదపడాలన్నారు. ధూమపానం నిషేదంపై ప్రభుత్వాలు కఠినచర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ కె.శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తేనే ధూమపానాన్ని నిషేదించడం సాధ్యపడుతుందన్నారు. బ్యాంకు ఛైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ సిబ్బంది, ఖాతాదారులకు ధూమపాన నిషేదంపై అవగాహన కల్పించాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని, ఎవరి ఆరోగ్యాన్ని వారే పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగి జివిఎస్.శివప్రకాష్ సేకరించిన వివిధ రకాల యాస్టిరీలు, ఇతర పురాతన ధూమపాన వస్తువులు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బ్యాంకు వ్యవస్థాపక ఛైర్మన్ పరుచూరి రఘునాథరావు, డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, ఎస్.ఆంజనేయులు, ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్ పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఉమామహేశ్వరరావు

వీధి వర్తకులకు రక్షణ కల్పించాలి : సిఐటియు



నిరసన తెలుపుతున్న వీధి వర్తకులు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రభుత్వాలపై ఆధారపడకుండా చిల్లర వర్తకం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వ్యాపారులపై జివిఎంసి దాడులు చేసి నష్టపరచడం అన్యాయమని, వీధి వర్తకులకు రక్షణ కల్పించాలని సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు డిమాండ్‌చేశారు. జివిఎంసి 7వ వార్డు పరిధి మిథిలాపురి ఉడాకాలనీ ప్రధాన రహదారిలో సుమారు 15 సంవత్సరాలుగా చిల్లర వర్తకం చేసుకుంటూ జీవిస్తున్న 60మందిపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ, తొలగిస్తూ తీవ్ర వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు రోజుల నుంచి ప్రతి రోజూ దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను నిరసిస్తూ ఉడాకాలనీ రోడ్డులో బుధవారం ఆందోళన చేపట్టారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ చిరు వ్యాపారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, రోడ్ల పక్కన తోపుడు బండ్లు, బల్లలు, తట్టలు, ఇతర పరికరాలతో వర్తకం చేసుకుంటున్నారని తెలిపారు. ఇటువంటి వారిని అన్ని విధాలా ఆదుకోవాల్సిన ప్రభుత్వం, అధికారులు దాడులు చేయడం అన్యాయమన్నారు. దాడుల ఆపి వర్తకం చేసుకునే విధంగా జివిఎంసి, పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు కె.పాపినాయుడు, వర్తకులు ఎం.ఆదినారాయణ, చందు, కె.కామేశ్వరరావు, శారద, కొండమ్మ, శ్రీను, కె.కృష్ణ, వై.రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో గీతం దంత చికిత్స విభాగం

ప్రజాశక్తి-విశాఖపట్నం : పెదవాల్తేరులోని జాలరిపేట పరిసర ప్రాంతాల ప్రజలకుఉచిత దంత వైద్య పరీక్షలు, నోటి ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడానికి వీలుగా గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యాన బుధవారం దంత వైద్య చికిత్స విభాగాన్ని గీతం అధ్యక్షులు ఎమ్.శ్రీభరత్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, జాలరిపేట వాసులకు స్థానికంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రితో పాటు నూతనంగా ఏర్పాటు చేస్తున్న దంత వైద్య సేవలు ఉపయోగపడతాయన్నారు. నిపుణులైన గీతం వైద్యులు ఉచితంగా స్థానిక ప్రజలకు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, స్థానిక పేద ప్రజల కోసం గీతం ఆసుపత్రి సేవలతో పాటు దంత వైద్యం అందిచడం అభినందనీయమన్నారు. గీతం దంత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటుచేసిన దంత విభాగంలో దంతాల సంరక్షణ, ఫిల్లింగ్, స్కేలింగ్, పాడైన దంతాలను తొలగించడం ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామానికి చెందిన అవంతి కల్యాణ మండపానికి బాందేవపురం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ బుగత శ్రీనివాసరావు 13 సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందించారు. తన తల్లి బుగత వరహాలమ్మ జ్ఞాపకార్థం ఫ్యాన్లు అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జోన్ - 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11 కెవి హెచ్‌పిసిఎల్ ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిఎం.పాలెం సెక్షన్ బక్కన్నపాలెం సబ్ స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పిసిఎల్ లే-అవుట్, రాజేశ్వరి అపార్ట్‌మెంట్, పొట్లూరి అపార్ట్‌మెంట్, మహాపుష్కర్, ఆసీన అపార్ట్‌మెంట్స్, సుగర్ ఫ్యాక్టరీ లే-అవుట్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించగలరని కోరారు.

మురుగు నీరు మళ్లింపునకు చర్యలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు జీరుపేటలో కాల్వల్లో నిల్వ ఉన్న మురుగు నీరు, పేరుకు పోయిన చెత్త మళ్లింపునకు చర్యలు చేపట్టనున్నట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి కాల్వలో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని పరిశీలించారు. సమస్య తీవ్రతను జోనల్ కమిషనర్ దృష్టికి వైసిపి నాయకులు జీరు వెంకటరెడ్డి తీసుకెళ్లారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువులో నూతనంగా నిర్మించిన ఆలయంలో విఘ్నేశ్వరుడు, కృష్ణుడు, హనుమంతు, సీతారామలక్ష్మణుల విగ్రహాలను బుధవారం ప్రతిష్టించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, వైసిపి నాయకులు అక్కరమాని వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి ఆలయం కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు.

పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీలు



హెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యాన...

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పొగాకుతో జీవితం నాశనం కావడమే కాకుండా కుటుంబం మొత్తం చిన్నాభిన్నమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జాతీయ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంబించారు. కార్యక్రమంలో డాక్టర్ రమారెడ్డి, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : స్టార్ట్ ప్లాంటింగ్.. స్టాప్ స్మోకింగ్ నినాదంతో వరల్డ్ నో టొబాకో డేను జరుపుకుంటున్నట్టు హెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రి సిఇఒ డాక్టర్ ఆదిత్య కౌర తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో విశాఖలోని అర్కే బీచ్ కాళీ మాత గుడి వద్ద నిర్వహించిన జుంబా ఫిట్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథిగా డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు హాజరయ్యారు. ఆసుపత్రి ఆంకాలజిస్ట్ డాక్టర్ సంకేత్ కోట్నే, జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు, పిఎఫ్ రీజనల్ కమిషనర్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. 'ఆహారం పండిద్దాం - పొగాకు మానేద్దాం' అనే నినాదంతో స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల, ప్రజారోగ్య దంత వైద్య విభాగం జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ప్ల కార్డులతో దంత వైద్య విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ అవినాష్, డాక్టర్ యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక స్వామి విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యాన స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని విశాఖపట్నం రీజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.హేమలత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షులు తుంపాల శ్రీరామమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. విద్యానికేతన్ నుంచి హైస్కూల్ రోడ్డు, జింక్ స్మెల్టర్ గేటు, కొత్త గాజువాక, పాత గాజువాక, ఆటోనగర్, జోగవానిపాలెం, అశోక్‌నగర్, మారుతీనగర్, శంకరనగర్ మీదుగా సాయిరాం నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి వైద్యులు, వైద్య విద్యార్థుల ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో పోగాకు వ్యతిరేక ర్యాలీని నిర్వహించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కాళీమాత ఆలయం సమీపం నుంచి వైఎమ్‌సిఎ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సీతారామరాజు, 350 మంది దంతవైద్య విద్యార్థులు, వైద్యులు, గీతం కార్యదర్శి ఎమ్.భరధ్వాజ, డాక్టర్ మనీష్ కుమార్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: సొంట్యాం ఆరోగ్య ఉప కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి పాల్గొని మాట్లాడుతూ, పొగాకు శరీరంలో ప్రతి అవయవాన్నీ నాశనం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పి.సన్యాసిరావు, సిహెచ్ఒఎం ఇందు, ఆరోగ్య కార్యకర్త గొర్లి సత్యవతి, ఆశా కార్యకర్తలు బూస అన్నపూర్ణ, బద్ధపు శివ శంకరి, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలో సర్వసిద్ధి పెనుగొళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వాసంతి, ఆరోగ్య విస్తరణ అధికారులు కంటపరెడ్డి నాగేశ్వరరావు, బి సత్యనారాయణ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ వాసంతి మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు నమిలితే ఊపిరితిత్తులకే కాకుండా నోటికి, జీర్ణాశయానికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. జూలై 31 వ తేదీ వరకు ఈ అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పి హెచ్‌ఎన్‌ఎం రత్న సఖి, హెల్త్ విజిటర్ సిహెచ్ రవణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు బి.ప్రేమ్ కుమార్, మలేరియా ఇన్చార్జి నోడల్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ:ధూమపానానికి దూరంగా ఉందాం.. మన ప్రాణాల్ని మనమే కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం విన్నూత్న రీతిలో గోలుగొండ పిహెచ్సి వద్ద డాక్టర్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు కాల్చడంతో నోటి, గొంతు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.ఏఎల్.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎన్ హరిప్రవీణ్ ఆధ్వర్యంలో వరల్డ్ నో టు బాకో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పి.పార్వతి, ఎల్.సావిత్రి పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజమే లక్ష్యం

అనకాపల్లి : పొగాకు రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌టిఆర్ గ్రౌండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నినాదాలతో చేస్తూ నెహ్రూ చౌక్ జంక్షన్‌కు చేరుకున్న ర్యాలీ, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల కేన్సర్ వంటి అనేక భయంకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అగనంపూడి డాక్టర్ హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ సౌజన్యంతో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలకు కేన్సర్‌ను గుర్తించడం, మాన్పించడపై అవగాహన కలిగించడంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పొగాకు వలన కలిగే అనర్థాలను తెలియజేసేలా హోమీబాబా కేన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కేన్సర్ అవగాహనకు వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి పోటీలు నిర్వహించి, విజేతలయిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డిఆర్ఒ వెంకటరమణ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎ.హేమంత్, జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎన్‌టిఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, ఓమ్ని బాబా కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ హోమీ బాబా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ డోలో రోజా ఫెర్నాండేజ్, డాక్టర్ రోహిత్ డాక్టర్ తరుణ్, జిల్లాలోని డాక్టర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అనిల్ నీరుకొండ దంత వైద్య విద్యార్థులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

పేదల ఇళ్లు కూల్చివేత



శాంతిపురంలో తొలగిస్తున్న ఇళ్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : సుమారు 40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న పేదల ఇళ్లను జివిఎంసి, సచివాలయం సిబ్బంది కలిసి కూల్చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి జాతీయ రహదారి సిగ్నల్స్ పక్కన శాంతిపురం రోడ్డు దగ్గరలో మాణిక్యం, సంతోషి, దేవుడమ్మ కుటుంబాలు 40 ఏళ్లుగా రేకుల షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి ఇళ్లకు కొద్ది దూరంలో నిబంధనలకు విరుద్ధంగా జి ప్లస్ టు భవనాన్ని రాజులమ్మ నిర్మించారు. సెల్లార్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా సెంటర్ స్టేర్ కేస్ ఏర్పాటుచేసి, రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని వ్యాపార గోదాములుగా నడుపుతున్నారు. ఈ తరుణంలో కొద్ది రోజుల క్రితం గోదాముల వద్దకు లోడుతో వెళ్తున్న లారీ పేదల ఇళ్ల గోడను ఢీ కొట్టింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనిపై వారంతా రాజులమ్మను నిలదీశారు. మమ్మల్నే ఎదిరిస్తారా, మీ ఇళ్లను కూల్చి వేయిస్తామని రాజులమ్మ, ఆమె భర్త కలిసి బెదిరించారని బాధితులు వాపోయారు. ఈ తరుణంలో బుధవారం ఉదయం సచివాలయ, జివిఎంసి సిబ్బంది ప్రొక్లైనర్‌తో వచ్చి పేదల ఇళ్లను తొలగించడం ప్రారంభించారు. మీడియా ప్రతినిధులు వెంటనే చేరుకొని ప్రశ్నించగా, రాజులమ్మ కుటుంబీకులు స్పందనలో ఫిర్యాదు చేశారని, అందుకే తొలగిస్తున్నామని ప్లానింగ్ సెక్రటరీ గౌరి తెలిపారు. 40 ఏళ్లుగా నివసిస్తున్న వారి ఇళ్లను తొలగించాలంటే ముందుగా నోటీసులు ఇవ్వాలి కదా అని విలేకర్లు ప్రశ్నించగా, జివిఎంసి, సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పకుండా

పెత్తందార్లకు అడ్డుగా ఉందనేనా?

వెళ్లిపోయారు. పేద ప్రజల సంక్షేమం కోసం సచివాలయం ఏర్పాటుచేశామని గొప్పగా చెప్పుకుంటుంటే, ఆ సిబ్బంది మాత్రం పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేపగుంటలో అర్ధరాత్రి షెడ్డు నేలమట్టం



వేపగుంట షిప్‌యార్డు లే-అవుట్‌లో కూల్చివేసిన రేకుల షెడ్డు

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలోని వేపగుంట షిప్ యార్డ్ లే-అవుట్‌లో సర్వే నంబర్ 164/1లో గల రేకుల షెడ్డును మంగళవారం అర్ధరాత్రి కిరాయి మూకలు దౌర్జన్యంగా తొలగించడం ఆ ప్రాంతంలో కలకలం రేపింది. స్థలం యజమాని మహేష్, మహిళా వాచ్‌మెన్ దేవి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. అర్ధరాత్రి సుమారు 1గంట సమయంలో దాదాపు 100 మంది కిరాయి మూకలు (వారిలో కొందరు మహిళలు ఉన్నారు) స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి షెడ్డు తలుపులు పగులగొట్టి అందులో నిద్రిస్తున్న తనను దౌర్జన్యంగా బయటకు లాక్కొచ్చి భయభ్రాంతులకు గురిచేశారని వాచ్‌మెన్ దేవి తెలిపారు. తన చేతిలో ఉన్నసెల్ ఫోను లాక్కొని ఫోను చేస్తే చంపేస్తామంటూ బెదిరించారని వెల్లడించారు. చూస్తుండగానే షెడ్డును కూల్చేసారని చెప్పారు. భూమి యజమాని మహేష్ మాట్లాడుతూ, తమ భూమిలో ఉన్న రేకుల షెడ్డును కొంతమంది రౌడీ మూకలు అర్ధరాత్రి దౌర్జన్యంగా కూలగొట్టారని చెప్పారు. ఒక మహిళ వాచ్‌మ్యాన్‌గా ఉంటున్న చోట ఇటువంటి అఘాత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. గతంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మంత్రి అమర్‌నాథ్ పేర్లు చెప్పి తమ భూమిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నించారని, 2010 నుంచి సివిల్ కోర్టులో కేసు నడుస్తుండగా ఇపుడు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. సమీపంలోని మరో వాచ్‌మ్యాన్ 100కి ఫోన్ చేసి జరిగిన సంఘటనను పోలీసులకు తెలియజేయడంతో నాలుగు గంటల సమయంలో పెందుర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారని వివరించారు. పోలీసులను చూసి కిరాయి రౌడీలు పారిపోతుండగా ఇద్దరిని పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసిందని పేర్కొన్నారు.



ఐద్వా ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న మహిళలు

రెజ్లర్లకు మద్దతుగా మహిళల నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి : రెజ్లర్లపై దాడిని ఖండిస్తూ జివిఎంసి 96వ వార్డు పరిధిలోని సిఐటియు కార్యాలయం వద్ద మహిళా సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ కార్యదర్శి లావణ్య మాట్లాడుతూ, దేశం పేరు ప్రఖ్యాతల కోసం కష్టపడిన రెజ్లర్లపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగాయన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకరరావు, అప్పలనాయుడు, ఐద్వా నాయకులు రజిని తదితరులు పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న ప్రసాదరావు

సమాజం పట్ల సేవాభావం ఉండాలి

ప్రజాశక్తి-పెందుర్తి : సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ సేవా భావం ఉండాలని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ (ఐహెచ్‌ఆర్‌సి) నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు పేర్కొన్నారు. ఐహెచ్‌ఆర్‌సి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా విశ్రాంత ఆర్మీ మేజర్ కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ కౌన్సెలింగ్ ఆఫీసర్‌గా విశ్రాంత ఎస్‌ఐ కె.గంగరాజు, విజయనగరం జిల్లా మహిళా ప్రెసిడెంట్‌గా పి.రుక్మిణి నియమితులైన సందర్భంగా జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లోని ఐహెచ్‌ఆర్‌సి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడారు. మానవ హక్కుల కోసం ప్రతి ఒక్కరూ తన వంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఉన్న చట్టాలను ఏ విధంగా సద్వినియోగ చేసుకోవాలని ప్రజలకు సంస్థ తరుపున అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సంస్థలోని పలువురికి ఐడి కార్డులను ఎయు డిప్యూటీ రిజిస్ట్రార్ సాంబమూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోల శంకరరావు, జనరల్ సెక్రటరీ జయకుమార్, యూత్ ప్రెసిడెంట్ సుగుణ్‌కుమార్, యూత్ వైస్ ప్రెసిడెంట్ డి.తేజేష్, మీడియా సెక్రటరీ ఇ.రవికుమార్, ఆర్‌టిఏ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ మధుజయరాజు, సెక్రటరీ ఆర్ ఇషిత, జాయింట్ సెక్రటరీ ఆర్.రిషిత, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్, వెల్ఫేర్ సెక్రటరీ బి.నర్సింగరావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కె.అప్పారావు, విమెన్ వైస్ ప్రెసిడెంట్ జె.అనురాధ, సెక్రటరీ బి.హరిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.ఉమాదేవి, విజయనగరం డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ వై.కిషోర్ కుమార్, సెక్రటరీ కెవి.రమణమూర్తి, డిస్ట్రిక్ట్ ఆర్‌టిఏ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ బి రమేష్ పాల్గొన్నారు.

పోస్ట్ మాస్టారు దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో పోస్ట్‌మాస్టారు పొన్నగంటి రామలింగేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ దంపతులను అగనంపూడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, పొన్నగంటి రామలింగేశ్వరరావు తపాలా శాఖలో జిడిఎస్‌గా చేరి క్రమశిక్షణ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోస్ట్ మాస్టారు స్థాయికి ఎదిగారన్నారు. పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు.

సన్మాన గ్రహీత పొన్నగంటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ, 1983 నవంబర్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో సామాన్య వర్కర్‌గా చేరి 40 సంవత్సరాలు పనిచేశానని తెలిపారు. విధి నిర్వహణలో సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన ఉద్యోగులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎడిసి డైరెక్టర్ కొలిపాక అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు తోకాడ రాము, టిడిపి నాయకులు కసిపల్లి శ్రీనివాసరావు, జనసేన నాయకులు పామల వసంతరావు, విశాఖ లయన్స్ క్లబ్ చైర్మన్ కడిమి హనుమంతరావు, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురుద్వారా జంక్షన్ వద్ద బస్సు షెల్టర్

ప్రజాశక్తి-సీతమ్మధార : గురుద్వార్ జంక్షన్ వద్ద రూ.20 లక్షలతో నూతన బస్సు షెల్టర్ నిర్మిస్తున్నట్లు జోన్ 3 ఇఇ శ్రీనివాసరావు తెలిపారు. అన్ని హంగులతో లైటింగ్ గ్రానైట్ మార్బుల్‌తో ఈ బస్సు షెల్టర్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. 20 రోజుల్లో ఈ బస్సు షెల్టర్ అందుబాటులోకి వస్తుందన్నారు.

50వ వార్డులో ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మురళీనగర్‌లోని టిడిపి కార్యాలయం వద్ద సనపల వరప్రసాద్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చిక్కాల విజయ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరిని వరప్రసాద్ సత్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, తెలుగువారికి నందమూరి తారకరామారావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎన్నో సంస్కరణలకు నాంది పలికారని కొనియాడారు. ఎన్‌టిఆర్ యుగపురుషుడు అని, పేదవాడి ఆకలి తీర్చడానికి పుట్టిన పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. మహానాడులో తమ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమన్నారు. వరప్రసాద్ సొంత నిధులతో నిర్వహించిన క్రీడా పోటీలు అభినందనీయమన్నారు. దువ్వారపు రామారావు మాట్లాడుతూ, ప్రజాసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మొదటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ అన్నారు. వరప్రసాద్ ఏర్పాటుచేసిన క్రీడా పోటీలను అభినందించారు. సనపల వరప్రసాద్ మాట్లాడుతూ, ఒక క్రీడాకారునిగా ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించానని చెప్పారు. యువతకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కూన రవికుమార్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 54వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కార్తీక్ కుట్టా, తెలుగుదేశం యువత అధ్యక్షులు బొండల మదన్‌మోహన్, వార్డు మహిళా అధ్యక్షులు పైడి పుణ్యవతి, సనపల రామచంద్రరావు, ఎండా ధాత్రి, చక్రి, పప్పల గౌరి, అప్పలనాయుడు, శేఖర్, పెంటకోట శ్రీను, పెంటకోట వెంకటరావు, ప్రమీలరావు, బొడ్డేపల్లి లలిత కుమారి, ధవల కుమారి, సనపల నరసింహస్వామి, రాము, చిన్నారావు, సంబాళ్ల సత్యనారాయణ, సనపల సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాలక్ష్మి హత్యను ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుమార్తె గిరిజన మహిళ ఎస్.మహాలక్ష్మిని అచ్యుతాపురం లాడ్జిలో అతి కిరాతకంగా హత్యచేసిన శ్రీనివాస్‌కుమార్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ప్లాంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షులు బోండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ, దళిత వర్గాలపై జరుగుతున్న దాడులను సహించేది లేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు సత్యం నాయుడు, కృష్ణనాయక్, కొమ్ము ప్రసాదరావు, మోహన్‌బాబు, పుల్లారావు, ఎస్.సత్య నారాయణ, నడుపూరి రమణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌సి, ఎస్‌టి యూనియన్ నాయకులు

రైతు వ్యతిరేక బిజెపిని గద్దె దించాల్సిందే!

ప్రజాశక్తి- మునగపాక రూరల్: రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి రైతులు చేపట్టిన తీవ్ర ఆందోళనకు తలొగ్గి నల్లసాగు చట్టాలను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించిన మోడీ ప్రభుత్వం, దొడ్డిదారిన వాటి అమలుకు పావులు కదుపుతోందని ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెల వద్ద ఆందోళనకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా, సేకరించిన ధాన్యం డబ్బులు ఇచ్చేందుకు నెలల తరబడి జాప్యంతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మళ్ల సంజీవి, కార్యదర్శిగా మద్దాల వెంకట్, ఉపాధ్యక్షులుగా ఆడారి సన్యాసినాయుడు, కోశాధికారిగా కోయిలాడ మహాలక్ష్మి నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ, ఎపి రైతు సంఘం మండల నాయకులు టెక్కలి జగ్గారావు, రైతులు సత్యమూర్తి, లక్ష్మణరావు, రమణ, నరసింహమూర్తి, వీరునాయుడు పాల్గొన్నారు.


రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు

పాత పద్ధతిలోనే ఉపాధి చేపట్టాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము


కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పాతపద్ధతిలోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను చేపట్టి, కూలీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, జగన్నాధపురం గ్రామాల్లో కూలీలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పాత పద్ధతిలో పనులు నిర్వహించాలని, వేసవి అలవెన్స్, గునపం, పార ఇతర పనిముట్లు ఉచితంగా ఇవ్వడంతోపాటు నీడ, నీరు, మెడికల్ కిట్స్ ఇతర సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా ఉపాధి పనిలో పాల్గొన్న కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లింపుతోపాటు జాబ్‌కార్డున్న ఒక్కో కుటుంబానికి ఏడాదికి 200 పనిదినాలు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి చట్టంలోని హక్కులను కాపాడుకునేందుకు కూలీలంతా ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో లక్ష్మి ధనుంజయ్ హరీష్ అప్పలరాజు ఉపాధి కూలీలు పాల్గొన్నారు

నేడు రెజ్లర్లకు మద్దతుగా సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : రెజ్లింగ్ మహిళా క్రీడాకారిణులను లైంగికంగా వేధించిన బిజెపి బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, క్రీడాకారులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసును వెంటనే ఎత్తివేయాలని కోరుతూ అనకాపల్లి నాలుగురోడ్ల సెంటర్ వద్ద వామపక్ష ప్రజాసంఘాలు, ఇతర పార్టీలు గురువారం ఉమ్మడిగా నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలోని కార్మిక సంఘాలు, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు .అనకాపల్లి జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసనను జయప్రదంచేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, గురువారం నిర్వహించనున్న సంఘీభావ ర్యాలీ, నిరసన సదస్సుపై చర్చించారు. అనకాపల్లి పట్టణంలోని విద్యార్థులు, యువజనులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొని క్రీడాకారులకు మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

నిర్బంధంపై ఖండన

అనకాపల్లి : తమకు జరిగిన అన్యాయంపై ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్ల అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని జన సాహితి అనకాపల్లి జిల్లాశాఖ అధ్యక్షులు నూకాచారి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను కాపాడుతూ, దాడులకు గురై న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. బేటి బచావో నినాదాన్ని ఇచ్చిన మోడీ ప్రభుత్వమే ఆ నినాదానికి తూట్లు పొడవడం విచారకరమన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి, పాలకులు అనుసరిస్తున్న దారుణ వైఖరిని ప్రజాతంత్ర మేధావులు, రచయితలు, కవులు కళాకారులు ఖండించాలని కోరారు.

అసమర్థ పాలనతో అభివృద్ధి శూన్యం

టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు


.మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి : అవినీతిపరుడు, అసమర్థుడి చేతికి పాలనాపగ్గాలు ఇస్తే అరాచక శక్తులు ఎలా పెట్రేగిపోతాయో, అభివృద్ధి ఎలా కుంటుబడుతుందో చెప్పడానికి నాలుగేళ్ల జగన్‌రెడ్డి పాలన నిలువెత్తు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మద్యం, మైనింగ్, ఇసుక మాఫియా ఒక్కటై పొలిటికల్ మాఫియాగా తయారై రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యధారాజా, తథా మంత్రి అన్నట్లు ఇక్కడ అమర్ పాలనలో అనకాపల్లి అన్ని రంగాల్లో సర్వనాశనమైందని మండిపడ్డారు. తుమ్మపాల సుగర్స్‌ను ఆధునీకరిస్తామని బూటకపు హామీలిచ్చి, ఏకంగా బుట్టదాఖలు చేశారన్నారు. రైతులు, కార్మికులు,ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతానని భరోసానిచ్చి, జిల్లాలోని అన్ని సుగర్ ఫ్యాక్టరీలను నట్టేట ముంచేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రాపకం కోసం అనకాపల్లికి మంజూరైన హార్టీకల్చర్ వర్సిటీని పులివెందులకు తరలించినా మౌనంగా ఉండిపోయిన అసమర్థులు అమర్ అని దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కెకెవి.నారాయణరావు, టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు దనాల విష్ణుచౌదరి, రాష్ట్ర వాణిజ్య విభాగం ఆధికార ప్రతినిధి సూరే సతీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, తెలుగు యువత పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బొద్దేడ మురళి, నేత ఆళ్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

దళిత నేతకు పరామర్శ


సన్యాసిని పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి- సబ్బవరం : అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన సీనియర్ దళిత నాయకుడు గొటివాడ సన్యాసిరావును మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బుధవారం పరామర్శించారు. సన్యాసిరావు ఇంటికి వచ్చిన కృష్ణ మాదిగ, సన్యాసిరావు సేవలను గుర్తు చేస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సన్యాసిరావు కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం అనకాపల్లి జిల్లా ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు గోటివాడ స్మార్ట్ కుమార్, ముమ్మిడివరపు సుబ్బారావు, తౌతరముడి శ్రీను, మల్లిబాబు, సాధురావు, చిన్నారావు, స్థానిక మహిళలు, పలువురు యువకులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ


శిక్షణ పొందిన మత్స్యకారులతో జెడి లక్ష్మణరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలకు రక్షణ పొందవచ్చునని జిల్లా మత్స్యశాఖ అధికారి పి లక్ష్మణ రావు అన్నారు. పిఎంఎంఎస్‌వై పథకం కింద జిల్లాలోని మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలోభాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై పూడిమడక, తదితర గ్రామాలకు చెందిన 50 మందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణను ప్రారంభించిన మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు మాట్లాడుతూ, .శిక్షణలో పాల్గొన్నవారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ సర్టిఫికెట్ అందిస్తారన్నారు. మూడు రోజుల పాటు రెస్క్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన భరత్, కొండలరావు, అజిత్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, మత్స్యశాఖ అధికారి రవితేజ, అప్పలనారాయణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో / ముగిసిన స్వచ్ఛత పక్వాడా ఉత్సవాలు



చెత్తబుట్టలను అందజేస్తున్న సిఎస్ఆర్ బృందం

ప్రజాశక్తి-పరవాడ: ఎన్‌టిపిసి సింహాద్రిలో మే 16 నుంచి నెలాఖరు వరకు నిర్వహించిన స్వచ్ఛత పక్వాడా పక్షోత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిసాయి ఈ సందర్భంగా టౌన్‌షిప్, చుట్టుపక్కల గ్రామాలలో పరిశుభ్రతపై అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మే 16వ తేదిన దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ప్రభాత్ పేరితో ప్రారంభమైన ఉత్సవాల్లో ప్రాజెక్ట్ ఉద్యోగులు, సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు, దీపికా లేడీస్ క్లబ్, కాంట్రాక్టు కార్మికులు, బాలికా సాధికారత మిషన్-2023 కింద వలస వస్తున్న బాలికల కోసం వివిధ పోటీలు, ప్రేరణాత్మక సెషన్‌లు, పరిశుభ్రత కిట్‌లను పంపిణీ చేశారు. ఎన్‌టిపిసి సింహాద్రి ప్రాజెక్టు పరిసరాలపై నగర ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎఫ్ఎం రేడియో ద్వారా అవగాహన సందేశాన్ని ప్రసారం చేశారు. సింహాద్రి ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు గ్రామాల్లో పర్యటించి పరిశుభ్రతపై వీధినాటకాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సిఎస్ఆర్ బృందం చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా నేతృత్వంలో బీచ్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. దీపాంజలినగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై దుకాణదారులతో కలిసి అవగాహన చేపట్టారు.

సన్ కాజల్ హోటల్ ప్రారంభం


హోటల్ ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్‌లో సన్ కాజల్ త్రీస్టార్ హోటల్‌ను బుధవారం ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి వాసులకు అధునాతన సౌకర్యాలతో త్రీస్టార్ హోటల్ అందుబాటులోకి రావడం ఆనందకరమన్నారు. వినియోగ దారుల మన్ననలతో సన్‌కాజల్ హోటల్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు

అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -.అనకాపల్లి : మండలంలోని తగరంపూడి సచివాలయ పరిధిలో రూ.12లక్షల మండల పరిషత్ నిధులతో అంగన్వాడీ భవనానికి, రూ.రెండు లక్షలతో మంచినీటి బోరుకు ఎంపిపి గొర్లి సూరిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. మంత్రి అమర్‌నాథ్ సిఫార్సుల మేరకు వాటిని నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపిపి అయితా ఆనంద రాము, యాదగిరి రామచంద్ర పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి సూరిబాబు

వైసిపి అక్రమ నిర్మాణాలపై ఉదాసీనత!

- వారం రోజుల్లో తొలగించకుంటే ఆందోళన ఉధృతం
- టిడిపి ఆధ్వర్యాన నిరసన : జెడ్‌సికి వినతిపత్రం అందజేత



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీలా గోవింద, తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి : అధికారం ముసుగులో వైసిపి చేపడుతున్న అక్రమ నిర్మాణాలు జివిఎంసి అధికారులకు కనిపించడం లేదాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద వైసిపి కొత్తూరు నర్సింగరావుపేటలో వైసిపి దౌర్జన్యంగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని నిరసన చేపట్టారు. అనంతరం జోనల్ కమిషనర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో సర్వేనెంబరు 75/3లో కాపు భవనం కోసం కేటాయించిన స్థలాన్ని మంత్రి గుడివాడ అమర్నాథ్ దౌర్జన్యంగా వైసిపి కార్యాలయానికి అప్పనంగా ముట్టజెప్పి తోటి కాపులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. అనుమతుల్లేకుండా వైసిపి అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వారం రోజుల్లోగా తొలగించకుంటే టిడిపి ఆధ్వర్యాన ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు, మళ్ల సురేంద్ర, సిరసపల్లి సన్యాసిరావు, కసిరెడ్డి సత్యనారాయణ, బివిఎంకె. జోగినాయుడు, సబ్బవరపు గణేష్, కనుమరెడ్డి గోవింద, యర్రా సత్యనారాయణ, పోలారపు త్రినాథ్, సురేష్, తలారి కాశీ నాయుడు, సూరి సతీశ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పోలీసు బదిలీల ప్రక్రియ



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి - అనకాపల్లి : పిపిటి ద్వారా ఖాళీలను ప్రదర్శించి, పోలీస్ సిబ్బంది బదిలీల ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత మాట్లాడుతూ, వివిధ కారణాల వలన బదిలీల కౌన్సిలింగ్‌కు హాజరుకాని వారితో వీడియో కాల్, ఫోన్ కాల్ ద్వారా స్వయంగా మాట్లాడి, వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేశామని, దీంతో పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారన్నారు. బదిలీల కౌన్సిలింగ్ కు మొత్తం 117 మందిని పిలిచామనారు. వీరిలో 12 ఎఎస్‌ఐలు , 30 మంది హెడ్ కానిస్టేబుల్స్, 75 మంది కానిస్టేబుల్స్ ఉన్నారని, ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం స్పౌజ్, మెడికల్ సమస్యలకు ప్రాధాన్యత కల్పించి, పోలీస్ సిబ్బంది ఎంపిక చేసుకున్న పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు. కొత్త పోలీస్‌స్టేషన్లో జాయిన్ అయ్యే సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, విధేయత, నైపుణ్యంతో పనిచేయాలన్నారు. ప్రజల పట్ల గౌరవ మర్యాదలతో మెలిగి, సానుభూతితో వ్యవహరించి పోలీస్ శాఖకు పేరు తెచ్చేలా విధులు నిర్వహించాలని సూచించారు. బదిలీల ప్రక్రియలో అదనపు ఎస్‌పిలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం సబ్ డివిజన్ ఎఎస్‌పి ఆదిత్య సింగ్ రాణా, డిపిఒ ఎఒ బి.శారద, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె. అప్పలనాయుడు, దిశ సిఐ టి.లక్ష్మి, ఎస్ఐ బి.యమున పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి - అనకాపల్లి : ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో అటు అధికారులు గానీ, ఇటు ప్రజా ప్రతినిధులు గానీ లేరని సత్యనారాయణపురం పంచాయతీ సుబ్రమణ్య కాలనీ, దళిత బహుజన కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పలు సమస్యలను ఏకరువు పెట్టారు. తమ ప్రాంతాల్లో వాలంటీర్లు సక్రమంగా పనిచేయలేదని, ఎక్కడికక్కడే మురుగునీటితో దోమల విజృంభిస్తున్నాయని, తాగునీటి సమస్య ఉందని వివరించారు. పలువురు ఎస్‌సి, ఎస్‌టిలకు రేషన్, ఆధార్ కార్డులు లేవని, ఇళ్ల స్థలాలు లేక ఎంతోమంది ఉన్నా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల సమయంలో సామాజిక భవన నిర్మాణానికి మంత్రి అమర్నాథ్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. దీనిపై తహశీల్దార్ గంగాధరరావు, ఎంపిడిఒ ధర్మారావు, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రేబాక మధుబాబు పరిష్కారానికి హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటస్వామి, గ్రామ కార్యదర్శి శ్రావణి, హెచ్‌డబ్ల్యుఒ రామయ్య, విఆర్ఒ మూర్తి పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర కల్యాణం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని దిబిడి మాణిక్యాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవంలోనూ బుచ్చయ్యపేట కందిపూడి పోలేపల్లి, తదితర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పాల్గొన్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు..

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కామాక్షమ్మ ఆలయంలో ప్రతిష్ఠించనున్న సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలను బుధవారం పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ పాల్గొని, ఊరేగింపు రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇద్దరు మంత్రులున్నా అనకాపల్లి అభివృద్ధి సున్నా!

టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల

ప్రజాశక్తి - అనకాపల్లి : వైసిపి అధికారంలోకొచ్చి నాలుగేళ్లయినా, జిల్లాకు ఇద్దరు మంత్రులున్నా అనకాపల్లికి ఒరిగిందేమీ లేదని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఆరోపించారు. మంత్రుల అండదండలతో వైసిపి శ్రేణులు భూఆక్రమాలు, దందాల్లో పురోగతి ఉందన్నారు. 1845 ఫిర్యాదులతో రాష్ట్రంలోనే కడప జిల్లా తర్వాత అనకాపల్లి జిల్లా రెండవ స్థానంలో ఉండడమే వైసిపి పాలనలో సాధించిన అభివృద్ధి అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పరిపాలనను గాలికొదిలేసి, అరాచకాలు, భూఆక్రమాలు, మైనింగ్, ఇసుక, గ్రావెల్ వంటి ఖనిజాలు ఎక్కడికక్కడ వైసిపి శ్రేణులు దోచుకుంటున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి పాలనలో చెత్తతో సహా అన్నింటిపైనా పన్నులు వేయడం, విద్యుత్, ఆర్‌టిసి బస్‌ఛార్జీలు పెంచడం, నిత్యావసరాలు, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నారన్నారు. రూ.136కోట్ల నిధులు మంజూరైనా పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి ప్రాజెక్టులను నీరుగార్చేశారని, ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రూ.68కోట్లు మంజూరైనా నాలుగేళ్లలో వీసమెత్తు పని జరగకపోవడం వైసిపి అసమర్థ పాలనకు, ఇక్కడి ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుకు నిదర్శనమని మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రితోపాటు కీలకమైన శాఖలకు మంత్రిగా ఉన్న బూడి, సొంతూరు దాటి రారని, చంద్రబాబు, పవన్‌లను విమర్శించడానికి తప్ప మరెందుకు పనికిరానట్లు మరోమంత్రి అమర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి



పేదలకు దుప్పట్లు, బిర్యానీ పంపిణీ చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - అనకాపల్లి : తెలుగు సినిమా ఇండస్ట్రీలో డేరింగ్ అండ్ డ్యాషింగ్ హీరోగా పేరొందిన సూపర్ స్టార్ కృష్ణ జయంతిని బుధవారం అనకాపల్లి కృష్ణ, మహేష్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ..అనకాపల్లి రాజా థియేటర్‌లో సీనియర్ కృష్ణ అభిమాని ఆళ్ల మాధవరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. సీనియర్ కృష్ణ అభిమానులు రజనీకాంత్, దొడ్డిబాబు, బొచ్చుశ్రీను, కాండ్రేగుల శ్రీను, ఆంధ్రప్రదేశ్ వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు, థియేటర్ మేనేజర్ ప్రభాకర్, పీలా రాజేష్, మహేష్ ఫాన్స్ సాయి, మణికుమార్, యూసఫ్, సాయి, నాని పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : జగనన్న భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తి చేసిన చింతపాక రైతులకు బుధవారం ప్రభుత్వపరంగా నూతనంగా మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను మండల నాయకులు దాకారపు నాగరాజు, స్థానిక సర్పంచ్ గొంజాన శ్రీను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సర్వే పనులను పారదర్శకంగా చేపట్టి, రైతులకు పాసు పుస్తకాలు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ నటించిన చిత్రాలతో కూడిన సినీ సంగీత విభావరి అలరించింది. కృష్ణ జయంతిని పురస్కరించుకొని గాయకులు పల్ల బాబ్జి నిర్వహణలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని సంగీత ప్రముఖులు సన్ మూర్తి, వెంకటేష్ మాస్టారు, బాబ్జి, డాక్టర్ హారిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రార్థన గీతం భాగ్యలక్ష్మి సినీరాజేశ్వరి, శైలజ, మాధురి, కల్యాణి తదితర గాయకులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు అమ్మాజీరావు, మహమ్మద్ ఖాన్, నాగేశ్వరరావు, వెంకట్, నాయుడు తదితరులు పాల్గొన్నారు. మను పల్ల, రాధారాణి తదితరులు అనేక పాటలు ఆలపించారు.

సతీష్‌కు ఘనసత్కారం



సతీష్‌ను సన్మానిస్తున్న బైలపూడి గ్రామ ప్రజలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంమండలం లక్ష్మవరం గ్రామంలో మోదకొండమ్మ విగ్రహ ప్రతిష్ట, మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం బైలపూడి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ముత్యాల సతీష్‌కు మంగళ హారతులతో కోలాటాలతో మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముత్యాల సతీష్ మాట్లాడుతూ ఎంవిఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవ చేయడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎవరికైనా ఎటువంటి సమస్యలున్నా తమను సంప్రదిస్తే, వెంటనే స్పందించి సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు

పంచాయతీ స్థల ఆక్రమణపై చర్యలేవీ ?

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాటజంగాల పాలెం గ్రామ పంచాయతీ స్థలం దురాక్రమణ చేసి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నట్లు స్థానిక రెవిన్యూ అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాటజంగాల పాలెం గ్రామానికి చెందిన గ్రంధి లక్ష్మీకాంతం ఇంటి ప్రక్కన ఉన్న పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి, అదనంగా గదులు, వరండా షెడ్ నిర్మించారని గ్రామస్తులు ఆరోపించారు. ఏప్రిల్‌లో కూడా స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం

వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి - అనకాపల్లి : వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైసిపి యువజన విభాగం అధ్యక్షులు పాలిసెట్టి సురేష్ అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, తనపై నమ్మకంతో వైసిపి యూత్ జిల్లా అధ్యక్ష బాధ్యతను అప్పగించిన మంత్రి అమరనాథ్‌కు, పార్టీ జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైసిపిని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్బవరం మండల వైసిపి మాజీ అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కూలి పెంచాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో దోనివాని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చట్టంలో ఉన్న సదుపాయాలు తగ్గించి ఇష్టానుసారం వ్యవహరిస్తుందన్నారు. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు తగ్గించి, కేవలం రూ.70 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో రెండు లక్షల కోట్లు నిధులు పెంచాలని, సంవత్సరానికి 200 రోజులు పని, రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా 30 శాతం వేసవి అలవెన్స్, మంచి నీరు, పార, గుణపం, తట్టలకు డబ్బులు, నీడకు టెంట్లు, మెడికల్ కిట్లు వంటి వాటిని సమకూర్చాలన్నారు. పే స్లిప్‌లు ఇచ్చి ప్రతివారం పేమెంట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు భరణికల రాము, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ, రైతు సంఘం మండల అధ్యక్షులు గింజాల శివాజీ, మరిణియ్య, చిలకమ్మ , అధిక సంఖ్యలో కూలీలు తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న అప్పలురాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి

ఆలయ ప్రతిష్ట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని నవర వీధిలో ఈనెల 1న గురువారం పోలి పిల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పోస్టర్ ఆవిష్కరించారు. నల్లబిడ్డి రమణ మన లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు నల్లబెట్టి నాగు ఆధ్వర్యంలో నిర్మాణం జరిగింది. నేటి కార్యక్రమంలో పూజా కార్యక్రమాలు, అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు నాగు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు పాల్గొన్నారు.

అధికారులతో ఆర్‌డిఒ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -కోటవురట్ల: తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం ఆర్‌డిఒ జయరాం నిర్వహించారు. మండలంలో ఇంతవరకు మండలంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల వివరాలు, ఇంత వరకు మొదలు పెట్టని లే అవుట్లు, అందుకు కారణాలు హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అన్నవరం, ఆక్షాహెబ్బేట, జల్లూరు, వెంకటాపురం, బి కే పల్లి, రామచంద్రపాలెం, పందూరు, ఎండపల్లి, తదితర గ్రామాల వివరాల సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో మండలంలో చేపడుతున్న రీ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎటువంటి పొరపాట్లు తలెత్తుకుంటా పని చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పౌర సరఫరాల గడ్డంగిని పరిశీలించారు, ప్రజలకు అందిస్తున్న సరుకుల వివరాలు వాటి నాణ్యత పరిశీలించారు. ఇంతవరకు వివిధ కేసుల్లో పట్టుబడ్డ 6 ఎ సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు జానకమ్మ, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, పిఆర్ ఇంజనీర్ వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -పాయకరావుపేట:

పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన జల్లి లోకేష్ (22) తన ఇంటిలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడి, తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై జోగారావు తెలిపారు. పోలీస్‌ల కథనం మేరకు.. జల్లి లోకేష్ బీటెక్ పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉంటున్నాడు. జేఎన్టీయూలో చదువుతున్న సమయంలో ఒక అమ్మాయిని ప్రేమించి ఆమెతో మనస్పర్ధలు వచ్చిన కారణంగా ఉరి వేసుకుని చనిపోయినట్లు తల్లి జల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

విజ్ఞానదాయకంగా వేసవి శిబిరాలు



అచ్యుతాపురంలో అవగాహన కల్పిస్తున్న లెక్చరర్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రరియన్ పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకరరావు మెడిటేషన్ పై అవగాహన కల్పించారు. ధ్యానం మన జీవితానికి ఎంత అవసరమో వివరించారు. నిత్యం అనేక సమస్యలతో సతమవుతున్న మానవునికి ఏకాగ్రత ఎంతో అవసరమని కథ రూపంలో వివరించారు. క్రాఫ్ట్ టీచర్ ఎల్ మాధవి నైలాన్ క్లాత్ తో పువ్వులు చేయడంపై వివరించారు.ఈ కార్యక్రమంలో సుమారు 50 విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండల కేంద్రమైన గొలుగొండ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతంగా కొనసాగుతుంది. గ్రంథాలయ అధికారి రాజగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, కథలు చెప్పించడం, పదాలు రాయించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం నీతి కథలపై చర్చ చేపట్టారు. అనేక నీతి కథలను చిన్నారులు చెప్పారు. అనంతరం పాటలు పోటీ నిర్వహించారు. సుమారు 25 మంది పాటల పోటీల్లో పాల్గొన్నారు. పాటల పోటీకి న్యాయనిర్ణేతలుగా జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, కార్మిక నాయకులు బి.సత్యానందం వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సింహాచలం: అడివివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం పొగాకు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, బిబి.రాజేంద్రప్రసాద్, ఎ.బాలబానుమూర్తి, ఎల్లమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో...



బుచ్చయ్యపేటలో..

అచ్యుతాపురం : అచ్యుతాపురం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అచ్యుత కాలేజీ లెక్చరర్ షేక్ బాజ్జి అవగాహన కల్పించారు..డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేకుండానే ముందుగానే అందుకు తగ్గ విద్యను నేర్చుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో వివిధ పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, కెరీర్‌ను చక్కదిద్దుకునే పుస్తకాలను గ్రంథాలయాలకు వచ్చి వినియోగించుకోవాలని సూచించారు

బుచ్చయ్యపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం లైబ్రేరియన్ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పోలీస్ స్టేషన్ కు చేరిన ప్రశ్నాపత్రాలు

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి : జూన్ 2 వ తేదీ నుండి నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత కేంద్రం గా ప్రారంభమవుతున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్ రాణీలలిత అన్నారు. ప్రతీరోజూ ఉదయం 9.30గంటల నుండి మద్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ సదుపాయాలతో పాటు వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో నుంచుకుని వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ప్రశ్నాపత్రాలు నక్కపల్లి చేరుకోవడంతో పరీక్షా సామగ్రిని పోలీస్ స్టేషనులో భద్ర పరిచామన్నారు. గురువారం పరీక్ష లకు హాజరయ్యే ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 8 వరకు పరీక్షలు జరుగుతాయని, కేంద్రాల వద్ద 144 సెక్షను అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షా విభాగాధిపతి వై.అప్పారావు, ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, గురుకుల పాఠశాల పరీక్షాధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ డే సప్లమెంటరీ పరీక్షలు బుధవారంతో ముగిసాయని కళాశాల ప్రిన్స్‌పాల్ బి.సాయికుమార్ తెలిపారు. గత మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ఈ నెల 24 నుండి 31 వరకు ఉదయం, మద్యాహ్నం సెషన్లలో మొదటి, రెండవ సంవత్సరాల జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 1371 మంది విద్యార్థులు పరీక్షలలో హాజరు కావలసి ఉండగా 1343 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

రేపటి నుండి పున్ణ ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో తరగతులు ప్రారంభం కానున్నాయని, అందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న సందర్భంగా కళాశాలలో తొలి విడత జాయినింగ్ పక్రియ జూన్ 15 వరకూ కొనసాగుతుందని ప్రిన్స్‌పాల్ సాయికుమార్ వివరించారు.

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం: మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామంలో బుధవారం గోకులపాడు గ్రామానికి చెందిన సమ్మంగి బాబ్జి మద్యం తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేసారు.13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

పౌర హక్కుల దినోత్సవ సభ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో బుధవారం చిన బొడ్డేపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవ సభను తహసిల్దారు జానకమ్మ దళితవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాల కోసం దళితులు హక్కుల కోసం పోరాడాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శివరాం, సంక్షేమ శాఖ అధికారి రాజ్యలక్ష్మి, ఆర్ఐ ఉర్ధవరావు, గ్రామ రెవెన్యూ అధికారి శివ పాల్గొన్నారు.



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న చంద్రబాబు

నూతన దంపతులకు చంద్రబాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు కుమారుడు రాజు, భాను ప్రియాంక దంపతులను బుధవారం సాయంత్రం అచ్యుతాపురం లేపాక్షి ఎంపోరియం ఫంక్షన్ హాల్‌లో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమములో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, ప్రగడ నాగేశ్వరరావు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ పప్పు ల చలపతిరావు, జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ లాలం భవానీభాస్కర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజన్న రమేష్‌కుమార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, పార్టీ కార్యకర్తలు అభిమానులు బంధువులు పాల్గొన్నారు.

చంద్రబాబు రాకతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం

నూతన దంపతులు రాజు, భాను ప్రియాంకలను ఆశీర్వదించడానికి చంద్రబాబు రాకసందర్భంగా, ఆయన ఫంక్షన్ హాల్లోకి ప్రవేశించగానే ఒకసారిగా కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది.

ప్రజాశక్తి-సీతమ్మధార : పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు కుమారుడు వివాహ వేడుకకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పి.చలపతిరావు, ఎమ్మెల్సీలు దువ్వాడ రామారావు, వెపాడ చిరంజీవి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కెవిఎస్ఎన్ఎస్.రాజు

ప్రజాశక్తి-కొత్తకోట:ఇటీవల జరిగిన తెలుగు దేశం పార్టీ మహానాడు సభలో టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టో వైసీపీ గుండెల్లో గుబులు రేపిందని, మహిళల అభ్యున్నతే తమ పార్టీ లక్ష్యమని చోడవరం మాజీ ఎమ్మెల్యే కెవిఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. రావికమతం మండలం కొత్తకోట లో చోడవరం టిడిపి మహిళా అధ్యక్షురాలు, కొత్తకోట మాజీ సర్పంచ్ కోట నీలవేణి గోవిందరావు ఇంటి వద్ద పలువురు మహిళలతో పాటు టిడిపి శ్రేణులతో కలసి మాజీ సిఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, చంద్రబాబు మహిళకు మరింత లబ్ది చేకూర్చే విధంగా అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు మేనిఫెస్టో తయారీ చేసారన్నారు. ముఖ్యంగా దీపం పథకం కింద సంవత్సరానికి ఉచితంగా మూడు సిలిండర్లు, మహిళలకు నెలకు 1500, ఆర్ టి సి లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు భృతి, తదితర పథకాలు అమలు చేస్తూ మేనిఫెస్టో విడుదల చేయడం ఆనందదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ మల్లు నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, గ్రామ టిడిపి అధ్యక్షులు శ్రీను, సత్తిబాబు, ఈశ్వరరావు, యువ నాయకులుదొరబాబు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలి

-ఆర్‌డిఓ కార్యాలయం వద్ద గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రోలుగుంట మండలంలో గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం పనసలపాడు రెవెన్యూ పరిధిలో 12 కుటుంబాలు ఎస్టీ భగత తెగలకు చెందిన వారు గత 50 సంవత్సరాల నుండి ఇదే గ్రామంలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి వీరి భూములను గిరిజనేతరులకు ఇవ్వడం దారుణమ న్నారు. గిరిజనుల భూముల్లో జగనన్న భూ రీ సర్వే పేరుతో సర్వేలు చేసి గిరిజనేతరులకు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, గిరిజనుల పేరుతో రికార్డులు ఉన్నాయని, అలాంటిది గిరిజనేతలకు పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సర్వే నెంబర్ 6-9లో 1-43 సెంట్ల భూమి తమటాపు సత్యనారాయణ మాజీ సర్పంచ్ పేరు మీద పట్టా ఇచ్చారని, ఇది ఎలా సాధ్యపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 6-1లో పది మంది ఆదివాసి గిరిజనులు 50 సంవత్సరాల నుంచి భూములు సాగు చేస్తున్నారని, పట్టాలు మాత్రం సాగులో లేని భగవతి మైథిలి కుమారి పేరు మీద పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా ఇచ్చారో అధికారులకే తెలియాలన్నారు. పనసలపాడు గ్రామంలో గ్రామసభ పెట్టలేదని, (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)డిఎల్ఆర్ లబ్దిదారులకు తెలియపరచకుండా రికార్డులు తయారు చేసేశారన్నారు.తప్పుడు పద్ధతిలో గిరిజన భూముల్లో గిరిజనేతలకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని, రోలుగుంట తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సమగ్రమైన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గేమిల చిన్నబ్బాయి, గేమిలా నూకినాయుడు, గేమిల మెచ్చుకొండ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, గిరిజనులు

గడప గడపకూ సమస్యలే..

ఎమ్మెల్యే బాబూరావు దృష్టికి పలు వినతులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో బుధవారం చినబొడ్డేపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు దర్శన మిచ్చాయి. ప్రధానంగా చినబొడ్డే పల్లి గ్రామంలో దళితవాడలో గతంలో నిర్మించుకున్న ఇందిరమ్మ కాలనీలు శిథిలావస్థకు చేరుకోవడం, వాటిని ప్రభుత్వం గతంలో ఆన్లైన్ చేయడంతో కొత్తగా మంజూరు, నిర్మించుకునేందుకు అవకాశం లేక అవస్థలు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వాటి స్థానంలో కొత్త ఇల్లు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాచపల్లి గ్రామంలో తాగునీటి సౌకర్యం, కాలువల నిర్మాణం చేపట్టాలని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువెళ్లారు. గ్రామంలో అంగన్వాడి సెంటర్ను తనిఖీ చేశారు. కరణం కొత్తూరు గ్రామంలో పారిశుధ్యం పట్ల పలువురు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, స్థానిక సర్పంచ్ శివరాం, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసిల్దార్ జానకమ్మ, బీసీ సెల్ అధ్యక్షులు పైల రమేష్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గొలుగొండ:మండలంలో ఏఎల్ పురం లో ఈనెల 1 నుండి గడపగడపకి మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. బుధవారం గొలుగొండలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పాల్గొంటున్న ఈ కార్యక్రమం నాలుగు రోజులు పాటు నిర్వహించనున్నామన్నారు. పంచాయతీలో రెండు సచివాలయాల పరిధిలో నాలుగు రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని ఆయన కోరారు.



కాలనీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అలరించిన నాటికలు

ఆకట్టుకున్న కళాకారుల అభినయం

ప్రజాశక్తి-మాడుగుల: మోదకొండమ్మ పండగ సందర్భంగా మాడుగులలో నిర్వహిస్తున్న ఆహ్వాన పరిషత్ నాటికలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. మంగళవారం బ్రహ్మం ఫౌండేషన్ (విశాఖ) ఇది కథ కాదు నాటిక, పిఠాపురం మణికంఠ ఆర్ట్స్ కొత్తతరం కొడుకు నాటికలు రక్తి కట్టించారు. అత్యాశతో ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీలో పెట్టుబడి పెట్టి మోసపోయి చివరికి భార్యా పిల్లలతో సహ ఆత్మహత్యకు పాల్పడటం, కుటుంబ సభ్యులను కోల్పోయి తండ్రి పడే ఆవేదన కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. బంగారు నంది గ్రహీత, జర్నలిస్ట్ ఎస్.డేవిడ్ రాజు రచన, దర్శకత్వం వహించగా రమణ, కుమారి(మాడుగుల), నూకరాజు, రాజు, మదీనా, విజయ్ సాయి నటించగా సంగీతం గణేష్ అందించారు. అనంతరం పిఠాపురం మణికంఠ ఆర్ట్స్ చెలికాని వెంకటరావు దర్శకత్వంలో ప్రదర్శించిన కొత్తతరం కొడుకు నాటిక ప్రేక్షకుల కంటి నీరు తెప్పించింది. తల్లి మరణంతో ఒంటరిగా వున్న తండ్రిని విదేశాలకు తీసుకు వెళ్లేందుకు కొడుకు పడే తపన, తండ్రి, కొడుకు మధ్య అనుబంధం, ప్రేమ అలరించాయి. ఈ నాటికలో నటీనటులు పోటీ పడి మరీ నటించారు. తండ్రి పాత్రలో ఊమా శంకర్, తల్లి పాత్రలో ఉమా మహేశ్వరి, కొడుకు పాత్రలో రాజ రిషి, పనివాడి పాత్రలో నగబట్ల రఘు ల నటన అలరించింది.



నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు



మాట్లాడుతున్న ఎఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా

ఎఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: జిల్లా విడిపోయిన తరువాత నర్సీపట్నంలో ఐపిఎస్ అధికారిని నియ మించలేదు. ఇప్పటి వరకు అనకాపల్లి ఇంచార్జ్ డిఎస్పి మాత్రమే ఉండే వారు. నర్సీపట్నం ఎఎస్‌పిగా అధిరాజ్ సింగ్ రాణా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కర్నూలు జిల్లా ఆదోనిలో పని చేశారు.ఈ సందర్భంగా ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ, గంజాయి రవాణా, నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-మాడుగుల:తొలకరి కొద్ది రోజులలో ప్రారంభం కానున్న నేపథ్యంలో పచ్చి రొట్ట, వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.వాసుదేవరావు తెలిపారు. జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలతో పాటు, బిపిటి(3290), బిపి టి(5204), ఎంటియు(1061), ఎంటియు (1064), ఎంటియు (7029), ఎంటియు (1124), ఆర్‌జిఎల్ (2537) వంటి రకాలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. రైతులు 1బి లేదా పట్టా దారు పాసు పుస్తకాలతో రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

7న గంటం దొర వర్ధంతి

అల్లూరి పార్కును పరిశీలించిన వీరభద్రరావు

ప్రజాశక్తి-గొలుగొండ: అల్లూరి సీతారామరాజు పితూరి సేనాధిపతి గాం గంటం దొర 99వ వర్ధంతి కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కులో ఈనెల 7న జరుప తలపెట్టినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు.బుధవారం ఆయన కృష్ణదేవిపేటలోని అల్లూరి స్మారక పార్కుని సందర్శించారు. ఈ సందర్భంగా గంటం దొర కుటుంబీకులను ఘనంగా సత్కరించడం జరుగుతుందన్నారు. చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, అన్నవరం పోలీస్ స్టేషన్లపై దాడిలో గంటం దొర కీలకపాత్ర పోషించారని తెలిపారు. గంటం దొర కుటుంబీకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కుటుంబంలోని అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని పడాల వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఆయన వెంట జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యనిర్వాహకురాలు శ్యామల, వరలక్ష్మి, కార్యదర్శి అంబటి వరహాలరాజు తదితరులు ఉన్నారు.